భక్తుల ఇంటికే భద్రాద్రి రాముని తలంబ్రాలు

హయత్‌నగర్: శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దకే చేర్చే కార్యక్రమాన్ని టీఎస్ ఆర్టీసీ కార్గో లాజిస్టిక్ విభాగం చేపట్టింది. ఎల్‌బీనగర్, ఆటోనగర్, హయత్‌నగర్ పరిసరాల్లో నివసించే వారు ఆయా ప్రాంతాల్లోని కార్గో బుకింగ్ కౌంటర్ల వద్ద రూ: 151 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని హయత్‌నగర్ 1,2 డిపో మేనేజర్లు జలగం విజయ్, శ్రీనివాస్ తెలిపారు. తలంబ్రాలు కావల్సిన వారు ఈ నెల 18లోపు ఆర్టీసీ ప్రతినిధులు అమరేందర్‌రాజు 9392774100, మురళీధర్ 7386187599 ఫోన్ నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

చైతన్యపురి: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయని సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి అన్నారు. చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. శ్రీవిరాట్ విశ్వకర్మ సేవా సమితి ఆధ్వర్యంలో గౌతంనగర్‌లోని స్వర్ణకార వీధిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఇన్‌స్పెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ మాధవరావు, స్వర్ణకార సంఘం మాజీ అధ్యక్షుడు ఎర్రోజు వేణుగోపాల్, సేవా సమితి సభ్యులు కీర్తిగారి అనంతాచారి, గోవర్ధన్‌చారి, నర్సింహచారి, రవి తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌బీనగర్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ



నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి,



ఎల్‌బీనగర్ ఎస్సీసెల్ చైర్మన్ జోగు రాములు తదితరులు

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



మూసారంబాగ్‌లో.. కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత,సురేందర్‌రెడ్డి



బీజేఆర్ భవనంలో.. బీఆర్‌ఎస్ నేత అరవింద్ శర్మ, పెండ్యాల నగేష్, దేవేందర్ తదితరులు



నివాళులర్పిస్తున్న దళిత, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బట్టు దాసురావు

ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ల బృందం: స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్లు, రాజకీయ పార్టీల నేతలు, దళిత, ప్రజా సంఘాల నాయకులు, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. డా.బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఎల్‌బీనగర్ ఉత్సవాల కమిటీ సమన్వయకర్త ఆడాల రమేష్, కొంగరి నర్సింహారావుల ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లో, ఆర్‌కేపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మారం దేవేందర్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని బీజేఆర్ భవన్‌లో, ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లోని పోచమ్మ ఆలయం చౌరస్తాలో బుగుడాల రాజు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. మాదన్నపేట హరిజనబస్తీలో, సైదాబాద్ డివిజన్ సాయిరాం కాలనీలో, మూసారంబాగ్ బ్రిడ్జి వద్ద ఉన్న బీజేఆర్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. కొత్తపేట బీజేఆర్ భవన్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



వనస్థలిపురంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మధుయాష్కీ గౌడ్ అన్నారు. వనస్థలిపురం సుష్మ చౌరస్తా సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ, నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో తాను ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ పార్టీ జనజాతర బహిరంగసభకు ఎల్‌బీనగర్ నుంచి భారీగా జన సమీకరణ చేస్తున్నామన్నారు. నాయకులు సామ రాంమోహన్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, సామ రమణారెడ్డి, సదాశివుడు, కుట్ల నర్సింహ యాదవ్, మంజులారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనజాతర సభను విజయవంతం చేయాలి..

చంపాపేట: టీపీసీసీ ఆధ్వర్యంలో తుక్కుగూడలో శనివారం నిర్వహించే జనజాతర సభకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ ఆలయ పాలకమండలి చైర్మన్, కాంగ్రెస్ నేత నల్లా రఘుమారెడ్డి కోరారు. శుక్రవారం చంపాపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ నాయకులు నిషీకాంత్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని విజయశ్రీ కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీసూక్త హోమం, సాయంత్రం 7 గంటలకు కాలనీ వీధుల్లో రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జొన్నాడ మోహన్‌రెడ్డి, కార్యదర్శి మార్గం రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ చీర్క నర్సిరెడ్డి, పోరెడ్డి రమణారెడ్డి, వారాల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత మోక్షం వైపు నడిపిస్తుంది



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి దంపతులు, కమిటీ సభ్యులు

మలక్‌పేట: ఆధ్యాత్మికత మార్గం మోక్షం వైపు నడిపిస్తుందని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని శ్రీ దుర్గా రాజరాజేశ్వరి త్రిశక్తి ఆలయ వార్షికోత్సవానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మన దేశ సంస్కృతి, సాంప్రదాయాల విశిష్టతను చాటి చెప్పేందుకు అందరూ కృషి చేయాలన్నారు. వార్షికోత్సవాల్లో భాగంగా ప్రధాన అర్చకుడు దేశపతి నాగరాజు నేతృత్వంలో చండీహోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో కమిటీ అధ్యక్షుడు జూకంటి యాదగిరి, ప్రధానకార్యదర్శి కాటపల్లి రాజేశ్వర్‌రావు, ట్రెజరర్లు విష్ణువర్ధన్‌యాదవ్, జంగయ్య, ఉపాధ్యక్షుడు నర్సింహ, శ్రీనివాస్‌గౌడ్, జంగారెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా..



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో కాలనీ ప్రతినిధులతో కలిసి పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ అన్నారు. కాలనీలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు కనీస వసతులు కల్పిస్తామన్నారు. నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు రాజు, నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న గ్రేట్ బాంబే సర్కస్



సర్కస్‌లో విదూషకుల విన్యాసాలు

వనస్థలిపురం: వనస్థలిపురం ఆటోనగర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రఖ్యాత గ్రేట్ బాంబే సర్కస్ ప్రేక్షకులను విశేషంగా అలరిస్తోంది. 30 ఏళ్ల తర్వాత నిర్వాహకులు ఆటోనగర్‌లో తిరిగి గ్రేట్ బాంబే సర్కస్‌ను ఏర్పాటు చేశారు. సర్కస్‌లో ప్రపంచ ప్రసిద్ధ ఇథియోపియన్ డయాబోలో, స్వింగింగ్ జిమ్ విన్యాసాలు, కంటార్షన్, రోలర్ బ్యాలెన్స్, రోలర్ స్కేటింగ్, ఫుట్ బాస్కెట్ బాల్, రష్యన్ హులా హూప్, స్కై వాక్, ట్రామ్పోలిన్, ఎక్సోటిక్ డాగ్ షో, కాలిక్యులేటింగ్ డాగ్, ఫ్లయింగ్ ట్రాపెజ్, ఫైర్ డ్యాన్స్ వంటి అద్భుత విన్యాసాలు, విదూషకుల చేష్టలు పిల్లలు, పెద్దలను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. సర్కస్ ప్రతిరోజూ మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం 4 గంటలకు, రాత్రి 7 గంటలకు మూడు షోలుగా నిర్వహిస్తున్నారు. ప్రేక్షకుల భద్రతను దృష్టిలో పెట్టుకొని అన్ని చర్యలు తీసుకున్నామని నిర్వాహకులు తెలిపారు.

రాజ్యాంగ రక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం



షేక్ అక్బర్ ఇచ్చిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న మధుయాష్కీ గౌడ్

సైదాబాద్: దేశంలో మతసామరస్యం, సెక్యులరిజం, రాజ్యాంగ రక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ షేక్ అక్బర్ ఆధ్వర్యంలో మలక్‌పేటలోని సిమ్లా గార్డెన్‌లో భారీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన మధుయాష్కీ ముస్లిం సోదరులతో కలిసి విందు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బీజేపీ, ఎంఐఎం పార్టీలు మత విద్వేషాలు రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నాయని ఆరోపించారు. ప్రజల మధ్య సోదర భావం, మతసామరస్యానికి ఇఫ్తార్ విందులు ప్రతీకగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్‌ఖాన్, ముజఫర్‌అలీ, మస్కతీ, బాలకృష్ణయాదవ్, మదన్‌బాబు, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాకు విశేష ఆదరణ



హ్యాండ్లూమ్ మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: చేనేత వస్త్రాలు, చేతి వృత్తులను అందరూ ఆదరించాలని, అపుడే ఆయా రంగాల్లో పని చేస్తున్న వారికి ఉపాధి దొరుకుతుందని ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ కమ్ సేల్) నిర్వాహకుడు అక్బర్‌అలీ అన్నారు. వనస్థలిపురం హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా ప్రజల ఆదరణ చూరగొంటోందని అన్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్ పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు, చెప్పులు, గాజులు, హైదరాబాద్ ముత్యాలు, బ్యాగులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని అక్బర్ అలీ అన్నారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం కేసు నమోదు

నాగోలు: బాలికపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తిపై ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం...నగరానికి చెందిన బాలిక (17) తన కుటుంబ సభ్యులతో కలిసి ఎల్‌బీనగర్‌లో ఉంటోంది. ఎల్బీనగర్‌లోనే ఉంటున్న ఆమె తండ్రి పదేళ్ల క్రితం మరో మహిళను పెళ్లి చేసుకుని బాలికను, ఆమె కుటుంబ సభ్యులను ఇంటి నుంచి బయటకు పంపేశాడు. బాలిక తండ్రికి ఇటీవల ఆరోగ్యం బాగోకపోవడంతో పిల్లలను చూడాలనుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తన సోదరుడితో కలిసి ఈ నెల 3న తండ్రి వద్దకు వచ్చింది. ఆ సమయంలో తండ్రి మద్యం తాగి ఉండటంతో ఈ రాత్రికి తన సోదరుడు హరీశ్ ఇంట్లో పడుకోవాలని సవతి తల్లి బాలికకు సూచించింది. దీంతో బాలిక సవతి తల్లి సోదరుడి ఇంట్లో పడుకుని ఉండగా అర్ధరాత్రి సమయంలో హరీశ్ లైంగికదాడికి యత్నించాడు. అతడి బారి నుంచి తప్పించుకున్న బాలిక విషయాన్ని సవతి తల్లికి చెప్పగా.. ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, హరీశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని దళిత యువతిపై లైంగికదాడి

రామోజీ ఫిల్మ్ సిటీ ఉద్యోగిపై అత్యాచారం, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు

నాగోలు: తనకు పెళ్లైన విషయాన్ని దాచిపెట్టి ప్రేమ, పెళ్లి అంటూ నమ్మించి ఓ దళిత యువతిపై లైంగిక దాడికి పాల్పడిన రామోజీ ఫిల్మ్ సిటీ ఉద్యోగిపై ఎల్‌బీనగర్ పోలీసులు అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలి కథనం ప్రకారం... ఎల్‌బీనగర్, బైరామల్‌గూడకు చెందిన యువతి (28) నగర శివార్లలోని రామోజీ ఫిల్మ్ సిటీలో ఉద్యోగం చేస్తోంది. ఇక్కడే పని చేస్తున్న సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం వల్లాపురం గ్రామానికి చెందిన కట్ల నరేష్ రెడ్డి (32)తో పరిచయం ఏర్పడి ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని అతను సదరు యువతిని నమ్మించి ఎల్‌బీనగర్‌లోని ఓ ఇంట్లో గది అద్దెకు తీసుకొని అందులో ఉంచాడు. ఆరు నెలల పాటు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. పెళ్లి చేసుకోకుండా మాయమాటలు చెప్ప సాగాడు. పెళ్లి చేసుకోమని యువతి ఒత్తిడి చేయడంతో రూమ్‌కు రావడం మానేశాడు. అతడి కోసం గాలించిన ఆమెకు చివరకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. నరేష్ రెడ్డికి గతంలోనే పెళ్లి జరిగిందని, ప్రస్తుతం అతను తన భార్యతో కలిసి చింతలకుంటలోని శ్రీనివాసపురం కాలనీలో ఉంటున్నాడని తెలిసింది. అతడి ఇంటికి వెళ్లిన సదరు యువతిని నరేష్ రెడ్డితో పాటు ఆయన భార్య, మరో వ్యక్తి కట్ల రాజేష్ రెడ్డి అసభ్య పదజాలంతో కులం పేరు దూషించారు. తమ జోలికి వస్తే చంపుతామని హెచ్చరించారు. తనను మోసం చేశాడని గ్రహించిన సదరు యువతి గురువారం రాత్రి ఎల్బీనగర్‌లో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కట్ల నరేష్ రెడ్డి, అతడి భార్యతో పాటు కట్ల రాజేష్ రెడ్డిలపై 376, 420, 504, 506 ఐపీసీ సెక్షన్ల కింద, ఎస్సీ, ఎస్టీ పీఓఏ యాక్ట్ అండ్ సెక్షన్ 156(3) సీఆర్పీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.